

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

**అంతే.** ఆ కార్యక్రమంలో నేనే 'బాలయ్య' పాత్రధారినైపోయాను. ముగ్గురం కలిసి అప్పటికప్పుడు ఆశువుగా మాట్లాడుకుంటున్నట్టుగా అంతకాలంపాటు కబుర్లు రాసి 'లైవ్'లో చదివేవాళ్ళం. అయితే నా రచనకు ప్రేరణ మాత్రం శ్రీ వెంకట్రామయ్యగారేనని కృతజ్ఞతాభావంతో చెప్పుకుంటూంటాను. ఆదివారాల్లో మాత్రమే మధ్యాహ్నం భోజనాల సమయంలో ప్రసారమయ్యే ఆ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రధాన రేడియో కేంద్రాలు రిలే చేసేవి. అందువల్ల మా ముగ్గురుకీ రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు చేకూరింది. హైదరాబాద్‌లోని అసెంబ్లీహాలు, నౌబత్ పహాడ్, పబ్లిక్ గార్డెన్స్ వంటి పర్యాటక ప్రదేశాలను చూసేందుకు వచ్చే పర్యాటకులు వాటికి దగ్గర్లోనే ఉన్న మా ఆకాశవాణి కేంద్రానికి కూడా కేవలం మమ్మల్ని కలుసుకుని మాట్లాడేందుకు వచ్చేవారంటే మీరు నమ్మాలి.

ఓసారి ఓ తమాషా జరిగింది. నాంపల్లి దగ్గర్లో వున్న బజార్ ఘాట్ ప్రాంతంలో ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్ వుండేది. (ఇప్పటికీ వుందిలెండి) దానికి డా. వారణాసి వెంకట సుబ్బారావుగారు సూపరింటెండెంట్‌గా వుండేవారు. ఓ ఆదివారం మధ్యాహ్నం ప్రసారమైన కార్మికుల కార్యక్రమంలో, కేన్సర్ వ్యాధిని ముందే గమనిస్తే ప్రమాదం సంభవించదనే విషయాన్ని మా హాస్యపు కబుర్లతో జోడించి చెప్పటం జరిగింది. ఆ కార్యక్రమాన్ని విన్న డా. వి.వి. సుబ్బారావుగారు, వెంటనే ఆకాశవాణికి ఫోన్ చేసి "బాలయ్య పాత్రధారిని పిలవండి" అన్నారు.

మా డ్యూటీ ఆఫీసర్ నన్ను పిలిచి ఆ ఫోను నాకు ఇచ్చారు. అప్పటికే నా పేరు తెలిసివున్న డాక్టర్ గారు "మీ కార్యక్రమం విన్నాను మూర్తిగారూ నేను ఇప్పుడే బయల్దేరి మీ స్టూడియోకి వస్తాను. మీరు అక్కడే వుంటే మనిద్దరం మంచి ఐస్‌క్రీమ్ పార్లర్‌కి వెడదాం" అన్నారు. నాకు ఆశ్చర్యం కలిగింది. అంత పెద్ద హోదాలో వున్న డాక్టర్‌గారు అడగటం నేను కాదనటమునా?

"ఉంటాను సార్. రండి" అన్నాను.

పావుగంటలో ఆయన వచ్చేసారు. ఆయన కార్లో కూచునే కారెక్కండి" అన్నారు నాతో. నేను ఎక్కి ఆయన పక్కనే కూర్చున్నాను.

"మీరు ఇంతకుముందు ప్రసారం చేసిన కార్యక్రమం విన్నాను. నన్ను ఎంతో ఆకర్షించింది. మీకు పార్టీ ఇవ్వాలని అనిపించింది. చెప్పండి. ఏ హోటల్‌కి వెడదాం?" అని అడిగారు.

"నేను భోజనం చేసే వచ్చాను సార్" అన్నాను.

వెంటనే ఆబిడ్స్‌లో నాగార్జున లాడ్జికి ఎదురుగా వున్న చైనీస్ హోటల్‌కి తీసుకువెళ్ళి 'బటర్ స్కాచ్' ఐస్ క్రీమ్ ఆర్డరిచ్చారు. అది తిన్నాక మళ్ళీ నన్ను రేడియో స్టేషన్ దగ్గర దించి వెళ్ళారు. ఆయన మాటలూ, ఆయన చిరునవ్వూ ఇప్పటికీ నేను మర్చిపోలేదు.

అలాగే ఎన్నో ఊళ్ళనించి ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలోని అనేక గ్రామాలకు చెందిన సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు మమ్మల్ని ఆహ్వానించి సన్మానాలు చేసేవారు. అలా కార్మికుల కార్యక్రమంలో 'బాలయ్య'గానే కాకుండా అప్పటికే కథా రచయితగా కూడా నాకు కొంత గుర్తింపు రావటంతో నాకు మొదటిసారిగా జరిగిన సన్మానం నేనెప్పటికీ మరిచిపోను.

1981లో ఆనాటి రేడియో శ్రోత అయిన శ్రీ జె. చెన్నయ్య (ప్రస్తుతం తెలంగాణా సారస్వత పరిషత్తు కార్యదర్శి) నవజీవన రేడియో సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేసి తాను నివసిస్తున్నది జడ్చర్లకు పక్కనే వున్న కావేరమ్మ పేటలోనే అయినా మహబూబ్ నగర్‌లోని టౌన్ హాలులో, ఆ జిల్లా కలెక్టరు శ్రీనారాయణరావుగారి ఆధ్వర్యంలో నాకు జరిపిన సన్మానం అది.

అలాగే హైదరాబాద్‌లోని మరో సాంస్కృతిక సంస్థ అయిన 'అభినందన' నిర్వాహకురాలు శ్రీమతి భవానీగారు స్థానిక త్యాగరాయ గానసభలో నాకు 'రచయిత'గా సన్మానం చేసి అప్పట్లో ఏదో రాష్ట్రానికి గవర్నర్‌గా వుంటున్న శ్రీ కోన ప్రభాకర్‌రావుగారు గారి చేతుల మీదుగా నాకు మెమెంటోను బహూకరింపచేసిన సంఘటన కూడా ఇప్పటికీ ఓ తీపిగుర్తుగా నా మనసు పొరల్లో భద్రంగా వుండిపోయింది.

ఓసారి 1977లో దివిసీమలో తుఫాను వచ్చి ఎంతో ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించాయి. సరిగ్గా అదే సమయంలో తెలంగాణాలోని వనపర్తికి చెందిన కొంతమంది రేడియో శ్రోతలు, అక్కడ మాకు సన్మానం ఏర్పాటు చేశారు. మేం వనపర్తి వెళ్ళాం. మా 'కబుర్లు' ప్రారంభించి, మధ్యలో దివిసీమ తుఫాను ఘోరాన్ని గుర్తుచేశాం. అక్కడివారికి సహాయం చేయటం తోటివారిగా మనధర్మమని చెప్పాం. అప్పటికప్పుడు ఓ సీనారేక్ డబ్బా తెప్పించి మీకు తోచిన ధనసహాయం చేయండని, సభికుల్ని అభ్యర్థించాం. ఎంతో ఉత్సాహంతో వారిలో చాలామంది అయిదు రూపాయలు మొదలుకొని 'నూట పదహార్లు' వరకూ విరాళాలు ఆ డబ్బాలో వేశారు. ఆ స్ఫూర్తితో వనపర్తికి చుట్టుపక్కల వున్న మరో రెండు మూడు గ్రామాలకు కూడా వెళ్ళి విరాళాలు సేకరించాం. అలా కేవలం రెండు రోజుల వ్యవధిలో పదివేలకు పైగా సొమ్ము చేరింది. మూడోరోజున హైదరాబాద్ చేరుకుని, ఆ డబ్బుకి డ్రాఫ్టు తీసుకుని 'ముఖ్యమంత్రి సహాయనిధి'కి అందచేసేందుకై, అప్పటి మా స్టేషన్ డైరెక్టర్ శ్రీ పుల్లెల వెంకటేశ్వర్లుగారిని వెంట బెట్టుకుని, సెక్రటేరియట్‌కి వెళ్ళి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారికి ఆ డ్రాఫ్టుని అందచేశాం. అప్పట్లో పదివేలంటే చిన్నమొత్తం ఏమీ కాదు కదా! ఏది ఏమైనా ఓ మంచి పనిచేశామన్న తృప్తి మాకు లభించింది.

ఇకపోతే ఆకాశవాణిలోని కుటుంబ నియంత్రణ విభాగంలో స్క్రిప్టు రైటర్‌గా నేను చేరినా, ఆ విభాగం అధిపతి శ్రీ మొదలి అరుణాచలం గారితోపాటు తెలుగు హాలులో కూర్చుని వుండే ఇతర ప్రముఖులూ ఇంకా లలిత సంగీత విభాగాన్ని నిర్వహించే శ్రీ పాలగుమ్మి విశ్వనాథంగారు, ఆ విభాగంలో కంపోజరుగా వుండే శ్రీ మహాభాష్యం చిత్తరంజన్‌గారు, వీణ విద్వాంసులు శ్రీ మంచాల జగన్నాధరావుగారు, శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు శ్రీమతి పాకాల సావిత్రిగారు, జానపద సంగీత కార్యక్రమాన్ని ప్రసారం చేసే వింజమూరి సీతాదేవిగారు, గ్రామస్తుల కార్యక్రమంలో 'మావ'గా వచ్చే ఆర్.సి.విరెడ్డిగారు హిందీ కార్యక్రమ విభాగపు అధిపతి శ్రీ రామ్మూర్తి రేణుగారు, ఆ విభాగపు స్క్రిప్టు రైటరు శ్రీ దండమూడి మహీధర్‌గారు ఇంకా చెప్పాలంటే స్త్రీల కార్యక్రమాలూ, పిల్లల కార్యక్రమాలూ నిర్వహించే శ్రీమతి తురగా జానకీరాణీగారూ తెలుగులో వార్తల్ని చదివే శ్రీయుతులు పన్యాల రంగనాథరావు, తిరుమలశెట్టి శ్రీరాములు ఇలా చెప్పుకుంటూపోతే కాకలు తీరిన కళాకారులు ఎందరో నాకు సుపరిచితులు అయ్యారు. వారందరూ నన్ను ఎంతో అభిమానించి ఆదరించారు. ఇంకా చాలామంది పేర్లు నేను మర్చిపోయివుంటే వారంతా నన్ను మన్నించాలి.

ఒకోసారి మనం చేసే సాహసం బెడిసికొడుతుందేమోకానీ రాష్ట్ర ప్రభుత్వంలోని విద్యాశాఖలో నేను చేసిన పర్మనెంట్ ఉద్యోగానికి రాజీనామా సమర్పించి ఆకాశవాణిలోని ఓ టెంపరరీ కాంట్రాక్టు ఉద్యోగంలో నేను చేరిన సాహసం మాత్రం నాకు విజయాన్ని చేకూర్చి పెట్టిందనే చెప్పుకుంటాను.

ముందుగా మూడునెలల కాంట్రాక్టు పూర్తిచేసి, తర్వాత మూడేళ్ళ కాంట్రాక్టులో పనిచేస్తుండగా దేశంలోని ఆకాశవాణి కేంద్రాల్లో 'స్టాఫ్ ఆర్టిస్టులు'గా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులునందర్నీ పర్మినెంటు చేసి, వారికి భవిష్యత్తులో పెన్షన్ సదుపాయాన్ని కూడా

కలుగజేస్తూ కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అది నా భార్యాపిల్లలు చేసుకున్న పుణ్యఫలం కావచ్చు. నా దైవబలం కూడా కావచ్చు. మొత్తానికి నేను రేడియోలో స్థిరపడ్డాను. అప్పటికి నా వయస్సు ముప్పైమూడు సంవత్సరాలు.

మన సమాజంలో రెండు రకాల మనుష్యులుంటారు. ఒక రకం ధనిక వర్గానికి చెందినవారైతే, మరోరకం పేదవర్గానికి చెందినవారు. ఆ రెండు రకాల్నీ పక్కనపెట్టి మరో రెండు రకాలవారి గురించి నేను చెప్పబోతున్నాను. అందులో 'ఫేస్' వాల్యూ కలిగినవారు ఒకరకం వారైతే 'పేరు వాల్యూ' కలిగినవారు మరో రకం. ఇందులో మళ్ళీ మొదటిరకం వారు చాలా తక్కువమంది వుంటే, రెండవరకం వారు చాలా ఎక్కువమంది వుంటారు. ఆ ఎక్కువమందిలో నాకూ చివరి స్థానమో, చిట్టచివరి స్థానమో లభించటానికి కారణం 'ఆకాశవాణిలో స్థిరమైన ఉద్యోగావకాశం దొరకటమేనన్నది నా నమ్మకం. అందుకే అనేక సభావేదికలపై 'నాకు ఇద్దరమ్మలు' అని చెప్పుకుంటూంటాను. ఒక అమ్మ పేగు తెంచి జన్మను ఇస్తే మరో అమ్మ 'ఆకాశవాణి' నాకు అన్నం పెట్టి ఆదరించింది. ఇప్పటికీ ఆదరిస్తూనే వుంది.

ఇక నాలో ఎలాంటి ఆకర్షణ కనిపించిందో నాకే తెలియదు కానీ నా సీటుకి ఎదురుగా కూర్చునే నాటక విభాగం అధిపతి శ్రీఎండూరి విఠల్‌గారు అపుడపుడు నా చేత రేడియో నాటకాలను నిర్వహింపచేయించేవారు. వారు దూరదర్శన్‌కి బదిలీ అయి వెళ్ళిపోయిన తర్వాత ఆ విభాగానికి అధిపతులుగా శ్రీయుతులు దేవళ్ళ బాలకృష్ణ, ఎ. వెంకట్రావ్ చౌదరి, వి.వి.శాస్త్రి, పి.ఎస్ గోపాలకృష్ణ, చేవలి దేవదాసు, సి.ఎస్.రాంబాబు ప్రభృతులు కూడా తరచుగా నాచేత నాటకాలు రాయించి, నిర్వహింప చేయించటం జరిగింది. వారి ప్రేమాభిమానాల్ని నేను జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను. ముఖ్యంగా నేను పత్రికలకు రాసిన, నా కథలనే రేడియోకి నాటికలుగా తిరిగి రాసుకునేవాణ్ణి. రేడియోకి నాటకం గానీ, నాటిక గానీ రాయటం చాలా క్లిష్టమైన ప్రక్రియ. రంగస్థలానికి రాసే నాటకం దృశ్య ప్రధానమైతే రేడియో నాటకం శ్రవ్య ప్రధానమైంది. వినపడుతూ కనబడే లక్షణం కలిగి వుండాలి రేడియో నాటకం. ఇందులోని పాత్రధారుల సంభాషణలు వింటుంటే శ్రోతలకు ఎవరు ఎవరితో మాట్లాడుతున్నదీ, ఎక్కడ ఎపుడు మాట్లాడుతున్నదీ మొదలైన విషయాలన్నీ కన్నులకు కట్టినట్టుగా అనిపించాలి.

నేను ఆకాశవాణిలో చేరిన తొలి సంవత్సరంలోనే (1972) అపుడెపుడో 1965లో నేను రాసిన 'జీవన వాహిని' అనే నవలను నాలుగు భాగాల ధారావాహికగా రాసి యువవాణి విభాగం నుంచి ప్రసారం చేసుకున్నాను. ఆ ధారావాహిక నాటకంలో అప్పటికే సుప్రసిద్ధ కళాకారులుగా పేరు తెచ్చుకున్న శ్రీయుతులు డి. వెంకట్రామయ్య, జి.జె.రవివర్మ, ఆకెళ్ళ సత్యన్నారాయణమూర్తి, రమేష్ పాత్రో, ఆకెళ్ళ సీతాదేవి, జ్యోత్స్న, వి. సత్యనారాయణ, వి. రతన్‌ప్రసాద్ మొదలైనవారంతా నటించి నాకూ, నాటకానికీ పేరు తీసుకొచ్చారు.

ఇప్పటి సంగతి నాకు తెలీదు కానీ అప్పట్లో రేడియో నాటకాల్లో నటించేందుకు కాకలు తీరిన నటీనట్లులు పేనల్‌లో ఎందరో వుండేవారు. నేను నిర్వహించిన అలనాటి నాటకాల్లో స్టాఫ్ ఆర్టిస్ట్ శ్రీమతి శారదా శ్రీనివాసన్‌గారితోపాటు శ్రీమతులు రత్నాసాగర్, మల్లాది విజయలక్ష్మి, సుందరీరావు, కె.అరుణకుమారి, ఏ. వసంతలక్ష్మి, శ్రీయుతులు వరప్రసాద్ (నూతన్ ప్రసాద్), దేశరాజు హనుమంతరావు, నండూరి మురళీకృష్ణ, ఆర్.వి.ఎస్.రామస్వామి, గరిమెళ్ళ రామ్మూర్తి, జె.సిద్ధప్పనాయుడు, బి.నారాయణ, విద్యాసాగర్, కోట శ్రీనివాసరావు, చాట్ల శ్రీరాములు, ఎమ్.బి.కె.వి ప్రసాదరావు, సుబ్బరాయశర్మ, జె.వి.సోమయాజులు, జె.వి రమణమూర్తివంటి ప్రముఖులు చాలామంది పాల్గొంటూండేవారు. అక్కడికి నేనేదో గొప్పవాణ్ణని చెప్పుకోవటంలేదు. అలాంటి నాటకరంగ పండితులనుంచి నేనే ఎన్నో మెలుకవలు ముఖ్యంగా వాచికాభినయం ఎలా వుండాలో, డైలాగు ఎక్కడ గంభీరంగా చెప్పాలో, ఎక్కడెక్కడ ఊర్పులూ, నిట్టూర్పులూ వాడాలో నేర్చుకున్నాను.

ఎలాగా రేడియో నాటికల ప్రస్తావన వచ్చింది కనుక నేను రేడియోకి రచించి, నిర్వహించి ప్రసారం చేసిన నాటికలూ నాటకాల పేర్లు నాకు గుర్తున్నంతవరకూ మీకు తెలియపరుస్తాను.

1972లో నేను రచించిన మొదటి ధారావాహిక నాటకం జీవనవాహిని మొదలుకొని నేను రిటైరయ్యేంతవరకూ అంటే 1997 వరకూ సుమారు పాతిక సంవత్సరాలకాలంలో మొత్తం 40కి పైగా నాటికలూ నాటకాలు రాసి వుంటాను. అవి ఏమిటంటే - అర్ధాంగి, నరకుడి పునర్జన్మ, ప్రియబాంధవి, మనుగడలో మలుపులు, మా ఊరి మారాజు, వెలుగు దైవజ్ఞశిఖామణి నగరానికి రాక, దేవుడు కరుణించాడు, పందిరిమంచం, కళ్ళు, జోస్యం, శ్రీవారి ప్రేమయాత్ర, అశ్రుఘోష, దేవుడు క్షమించడు, రామరాజ్యం, గాంధీ పుట్టినదేశం, 'సన్'తోషం, ముఖం చూసి మాట్లాడు, 'ఊర్మిళ - ఉగాది కథలపోటీ' అల్లుడొస్తున్నాడు జాగ్రత్త, తాతామనవడు, శ్రీరాగం, చక్రభ్రమణం, వంశానుగతం, యావ, షష్టిపూర్తి, అమూల్యం, గోదానం, తల్లిమనసు, పాదుకాపట్టాభిషేకం, అల్లుడొచ్చాడు, పాత జీవితానికి కొత్తమలుపు, మామాజీ మొదలైనవి.

ఇక 1997లో నేను రిటైరైన తర్వాత రాసిన నాటకాలు, నాకు గుర్తున్నంతవరకూ తెలుపుతాను. అవి, 'ఇద్దరూ ఇద్దరే, అందరూ ఆడపిల్లలే, అమ్మకోముద్దు (4 భాగాల ధారావాహిక) ఇది నాటకం కాదు, కీర్తిశేషుడు, ప్రవృద్ధాశ్రమం' - అలాగే కొంతమంది ప్రముఖ రచయితలు రచించిన నవలల్ని కూడా రేడియో నాటకాలుగా అనుసరిస్తూ రచించాను. శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌గారి నవల 'నిశ్శబ్దం నీకూ నాకూ మధ్య', మల్లాది వెంకటకృష్ణమూర్తిగారి 'మందాకిని' శ్రీధర రాధాకృష్ణమూర్తిగారి 'రాగవిపంచి', ముదిగొండ శివప్రసాద్‌గారి 'అనుభవ మండపం', డా.కె.వి కృష్ణకుమారిగారి 'రంగుటద్దాలు', ఆదివిష్ణుగారి 'ది ఆత్మహత్య' మనిషి, కె.కె.మీనన్ గారి 'క్రతువు' ఇలా చెప్పుకుంటూపోతే నేను రేడియో ప్రసారం కోసం రాసిన నాటికలూ నాటకాలూ నాకు గుర్తుకు రానివి కూడా ఇంకా కొన్ని మిగిలేవుంటాయి.

అయితే ఆ నాటికలు నాటకాల తాలూకు కాపీలు కూడా ఇపుడు చాలావరకూ నా దగ్గర లభించని పరిస్థితిలో వున్నాను. అందుకొక కారణం లేకపోలేదు. అప్పట్లో రేడియోకి ఏం రాసినా కూడా దాని 'ఒరిజనల్'ని 'లాగింగ్' చేసుకునేందుకు 'డ్యూటీరూమ్'లో ఇచ్చే పద్ధతి ఆనవాయితీగా ఉండేది. వాటిని 'ప్రోగ్రాం క్యూషీట్లకు' జతపరచేవారు. అందుకే వాటి కాపీలు నా దగ్గర చాలావరకూ లేకుండాపోయాయి.

అలాగే రాష్ట్రంలో జరిగిన పరిషత్తు నాటకపోటీలకూ, నంది నాటిక పోటీలకు నేను అనేకసార్లు న్యాయనిర్ణేతగా వెళ్ళిన సందర్భాల్లో ఏదైనా మంచి రంగస్థల నాటకం కనిపిస్తే దాన్ని రేడియో నాటకంగా రాయించి తీసుకున్న సందర్భాలు కూడా కొన్ని లేకపోలేదు.

నేను 1988వరకూ హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో పనిచేసి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా ప్రమోషన్‌పై 1998 మే నెలలో కడప ఆకాశవాణి కేంద్రానికి బదిలీ అయి వెళ్ళాను. అక్కడ ప్రముఖ కవివరేణ్యులు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులుగారితోనూ, ప్రముఖ కథా రచయితలు శ్రీ మధురాంతకం రాజారాం, శ్రీ పులికంటి కృష్ణారెడ్డి, శ్రీ కలువకొలను సదానంద మొదలైనవారితోనూ అలాగే ప్రముఖ అవధాని శ్రీ నరాల రామారెడ్డి మొదలైన వారెందరితోనో నాకు పరిచయభాగ్యం లభించింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments